"మీతాతగారు పోయాక అక్కడ ఉండడం లేదు కదాని ఆ ఇల్లు అమ్మేస్తే వచ్చిన నాలుగు డబ్బులూ నీ సీటుకోసం మీనాన్నకి ఇష్టం లేకపోయినాగానీ బలవంతంగా ఒప్పించి డొనేషను కట్టాను. కానీ నెలనెలానే ఖర్చులకనీ, ఫీజులకనీ పంపించాల్సింది మీనాన్నే కదా! నూరు రూపాయలు సంపాదన ఉంటే, ఖర్చు తొంభై రూపాయలు మించకూడదనేది మీనాన్న పద్ధతి. నిన్నటి వరకూ సంసారాన్ని అలాగే నడుపుకొచ్చారు. ఇదిగో, నీ చదువు వచ్చాక ఎంతో కొంత అప్పు చేయక తప్పటం లేదు. తలకు మించిన భారం మీనాన్నపై పెట్టానని బాధగా ఉంటోంది. నీకు పంపించటం కోసం ఇంట్లో అంతా అన్ని అవసరాలను తగ్గించుకుని, ఎన్ని ఇబ్బందులు పడుతున్నారో అర్థం చేసుకుని రెట్టింపు బాధ్యతగా చదువుకోవాల్సింది పోయి, నీకేమో షికార్లు, సరదాలు ఎక్కువవుతున్నట్లున్నాయ్! మన ఖర్చులు మన స్థోమతనుబట్టి ఉండాలి కానీ పక్కవాడిని చూసి కాదురా!"[117]

ఇటువంటి సన్నివేశాలను కల్పించడం ద్వారా రచయితలు సమాజంలో మార్పును కోరుకుంటారు. తమ కథలలో సన్నివేశాలను స్ఫూర్తిగా తీసుకుని కొందరి పాఠకులలో మార్పు వచ్చినా, వారి ఆశయాలు, లక్ష్యాలు కొంతమేర సఫలీకృతమయినట్లే. నానాటికి విలువలు అంతరించి పోతున్న సమాజంలో తమ రచనల ద్వారా జాగృతం చేసే ప్రయత్నం చేస్తున్నారు రచయిత్రులు. నేటి సమాజంలో యువత చెడు వ్యసనాలకు, అలవాట్లకు లోనై దిగజారిపోతున్నారు. అటువంటి యువతను మంచిదారి వైపు నడిపించే ప్రయత్నం చేశారు ఈ సన్నివేశం ద్వారా రచయిత్రి.

### 5.8.14 వినుత పాత్ర ద్వారా పురుషాధిక్యతను నిరసించే సన్నివేశం :

"మొగలిపువ్వు" కథలో పిల్ల పుడితే చులకనగా చూడటం మగపిల్లాడు పుడితే సంబరాలు చేసుకునే ఆనవాయితీని నిరసిస్తారు ఈ సన్నివేశంలో రచయిత్రి.

"ఫోన్ మోగితే కార్డ్‌లెస్ తెచ్చి అతనికి ఇచ్చింది.

డబుల్ ప్రమోషన్ అన్నమాట! కంగ్రాట్స్! తప్పక వస్తాను? అంటూ ఫోన్ పెట్టేసి, మూర్తికి మళ్ళీ అబ్బాయట. రేపు పార్టీ ఇస్తున్నాడు అని చెప్పాడు. వాళ్ళు ఈసారి అమ్మాయి కావాలని ఆశపడి ఉంటారు! నువ్వేమిటి డబుల్ ప్రమోషన్ అంటావ్? అమ్మాయిలయితే కష్టంగానీ, ఇద్దరూ అబ్బాయిలే అయితే అదృష్టమే కదూ? కట్నాలిచ్చి పెళ్ళి చేయడానికి కూడబెట్టాలనే బెడద లేకుండా నిశ్చింతగా బ్రతకొచ్చు!

117. మంచి గంధం కథ – మనసున మల్లెలు కథా సంపుటి – గోగినేని మణి – పుట 80

సత్యం మాటలకు ఒక క్షణం నివ్వెరపాటుతో స్థాణువులా నిలబడి పోయింది.

ఈ రోజుల్లో కూడా ఇంకా ఇలా మాట్లాడే వాళ్ళున్నారా...! ఏ వెనకటితరం వాళ్ళో కాకుండా, నువ్వే ఇలా మాట్లాడటం... ఛ... నమ్మలేకపోతున్నాను! ఆడపిల్లలయినా, మగపిల్లలయినా సమానంగా పెంచి చదివిస్తున్నారు. ఉన్నదాంట్లోనే ఇద్దరికి చెరిసగమిస్తారు. అమ్మాయికి పెళ్ళిలో ఇస్తే, అబ్బాయికి తర్వాత ఇస్తారు. అంతేగా! అమ్మాయిలే ఇంటికి అందం అని అంటారుగా! నాకు అమ్మాయిలే కావాలి!

అందచందాలు, ఇష్టాల సంగతి పక్కన బెట్టు. ఒకరైనా, ఇద్దరైనా నాకు అబ్బాయిలే కావాలి! అమ్మాయిలంటే ఇష్టమైనా వాళ్ళ పెళ్ళిళ్ళు పేరంటాల బాదరబందీలు నేను భరించలేను! అబ్బాయిలే కావాలని ఇద్దరం దేవుడికి దండం పెట్టుకుందాం!

అమ్మాయిల కష్టాల గురించి ఆలోచించి వద్దనుకోవడంవేరు! కానీ... బాధ్యతకు భయపడి వద్దనుకోవటమా... ఛ...! కని పెంచడానికి ఆడదికావాలి... జీవితం పంచుకోవడానికి కావాలి... పెంచే బాధ్యత తీసుకోవాల్సివస్తే మాత్రం అక్కర్లేదు![118]

ఈ సన్నివేశంను చదివిన ప్రతి పాఠకుడికి ఆలోచింపచేస్తుంది. పురుషాధిక్య భావజాలంతో ఉన్న ప్రతి ఒక్కరు సిగ్గుపడే విధంగా ఈ సన్నివేశాన్ని కల్పించారు రచయిత్రి. అబ్బాయి పుడితే అదృష్టంగా భావించి, అమ్మాయి పుడితే కష్టమని భావించే ప్రతి తండ్రిని చెంప ఛెల్లుమనేలా వాయించేటట్లు వినుత పాత్రను తీర్చిదిద్దారు రచయిత్రి.

### 5.8.15 డబ్బు సంపాదనలో పడిన తన కొడుకును తల్లి చైతన్యపరిచే సన్నివేశం :

"ఎదురుచూపు" కథలోని ఈ సన్నివేశంలో రచయిత్రి మనం ఉండే ఇల్లు ఎంత పెద్ద భవనమైనా ఆ ఇంట్లో ప్రేమానురాగాలు, ఆప్యాయతలు, నిండు మనసుతో కూడుకున్న పలకరింపులు లేకపోతే అది నిర్జీవమైన కట్టడమే అని అంటారు.

"కుటుంబ సభ్యుల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణం, ఆప్యాయతల పరిమళం లేకపోతే అది ఇల్లు కాదు... నిర్జీవమైన ఇటుకల భవంతి మాత్రమే!!

నిన్ను అవమానించిన వాళ్లకి... సంపాదించి చూపించటమే ప్రతీకారం తీర్చుకోవటం

118. మొగలిపువ్వు కథ– మొగలిపువ్వు కథా సంపుటి – గోగినేని మణి – పుట 21

అని నువ్వు భావించావు... ప్రేమించిన అమ్మాయికి సహాయపడటమే ప్రేమ లక్షణం అనుకున్నావు. మరి ఇదేంట్రా.. నీ పెంపకంలో పెరిగిన పిల్లలు తమ ప్రేమనుకాదన్న వాళ్ల అంతు చూడాల్సిందేనని విర్రవీగుతున్నారు! ఏ తప్పు చేసినా తప్పించుకోగల అధికులమనే అహంకారంతో తిరుగుతున్నారు. నువ్వు సంపాదనలో పడి నీకు తెలియకుండానే కుటుంబాన్ని నిర్లక్ష్యం చేశావనిపించింది.

పిల్లల మనసుల్లోని సమాజానికి హాని కలిగించే ఆలోచనలను తెలుసుకోలేకపోవటం వాళ్ళని మందలించలేకపోవటం... తల్లిదండ్రుల తప్పే అవుతుంది. పిల్లల పట్ల బాధ్యతా రహితంగా ప్రవర్తించటం.. ఇంట్లో బాంబులు తయారుచేయడంకంటే తక్కువ నేరం కాదు!

కోడలు ఎవరికీ ఏమీ చెప్పలేని నిస్సహాయురాలైపోయింది. ఏదో పోగొట్టుకుని... ఇంకేవో కొనుక్కుంటున్నట్లుగా... ఖరీదైన వ్యక్తుల పెళ్లిళ్లకు, పార్టీలకువెళ్తూ కాలక్షేపం చేస్తోందని నాకనిపించింది.

ఏ గిన్నెలో వుంటే నేమి గాని, రుచికరమైన పాయసమ్ ముఖ్యమని నేననుకుంటాను. మీకు మాత్రం అది అందమైన దగదగలాడే వెండి గిన్నెలో ఉండాలి. రుచితో పట్టింపులేదు. నేనలా రాజీపడలేక అక్కడ ఉండలేక ఇక్కడికి వచ్చేశాను. మీ జీవనసరళి అంతేనని చేయగలిగింది ఏది లేదని నువ్వనుకుంటే... సరే, చేసేదేం లేదు. కానీ చిన్నా...! నా కోరిక ఏమిటంటే నువ్వొక్కసారి వెనక్కి తిరిగి చూసుకో... నువ్వు సంపాదించిన దానికంటే పోగొట్టుకున్నదే ఎక్కువనీ, అదే అమూల్యమైనదనీ నీకర్థమవుతుంది. గతంలో నీఆలోచనలు ఎలా వుండేవో గుర్తు చేసుకుని... పగ్గాలు చేతపట్టుకుని నీ ఇంటిని అందమైన పూలతోటలా తీర్చిదిద్దే ప్రయత్నం మొదలుపెట్టాలనుకుంటే నువ్వు తప్పకుండా సాధించగలుగుతావు."[119]

డబ్బు సంపాదన మోజులో పడి ఇంటిని, సంసారాన్నీ, భార్యను, పిల్లలను పట్టించుకోని కొడుకును తన ఉత్తరంద్వారా ఒక తల్లి చైతన్యపరిచే సన్నివేశాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు రచయిత్రి.

---

119. ఎదురుచూపు కథ – మొగలిపువ్వు కథా సంపుటి – గోగినేని మణి – పుట 32

## 5.9 కవితాత్మక వ్యక్తీకరణ :

రచయిత తమ రచనలలో పాఠకునికి కొత్తదనాన్ని అందించాలని ప్రయత్నిస్తాడు. భావుకుడైన రచయిత తనరచనలలో అవసరమైనప్పుడు కవితాత్మకంగా పాత్రలద్వారా సంభాషణలు పలికిస్తాడు. ఇటువంటి వ్యక్తీకరణవల్ల ఆయా రచనలకు మరింత పరిపుష్టి కలుగుతుంది. సహృదయ పాఠకుడికి హృదయోల్లాసాన్ని కలిగిస్తుంది. గోగినేనిమణి రచనలలో ఇటువంటి వ్యక్తీకరణలు కోకొల్లలు. వాటిలో కొన్నింటిని ఈ క్రింద పరిశీలించడం జరిగింది.

"కానుక కథ"లోని కథానాయకుడు శరత్, కథానాయిక సీతను చూసి పలికిన పలుకులు.

***"పెదవులపై చిరునవ్వుల పువ్వులు***
***కురులలో సిరిమల్లెల చిరునవ్వులు"*** [120]

పెదవులపై నవ్వులపువ్వులు, జడలో మల్లెల నవ్వులు ఎంతో అందమైన భావుకత. స్వచ్ఛమైన చిరునవ్వును పువ్వులతో పోల్చడం, కురులలో ఉండే మల్లెలు అటు ఇటూ కదులుతుంటే అవి నవ్వుతున్నట్టు భావించడం సహృదయుడైన పాఠకునికి చక్కటి అనుభూతితో కథను చదవడానికి ప్రేరణ కలిగిస్తుంది.

"స్నేహం" కథలోని స్నేహాన్ని గూర్చి వర్ణిస్తూ కవితాత్మకంగా రచయిత్రి ఇలా అన్నారు.

***"దోస్తిని మించింది లేదులోకాన...***
***అది రత్నాల కన్నా మిన్నతూకాన...***
***మిత్రుడే కావాలి సుఖమున శోకాన..."***

అంత్యప్రాసతో సాగిన ఈ పంక్తులు సహృదయ పాఠకునికి అలరిస్తాయి.

"ఇద్దరు... ఏకవచనం కథ"లోని కథానాయిక శ్వేత ఆనందాన్ని వర్ణిస్తూ...

***"నందనవనంలో నివాసం... చందమామతో సావాసం"*** అని ప్రాసయుక్తంగా ఆమె స్నేహితురాలితో పలికిస్తారు.

..........

**120. కానుక కథ – మనసునమల్లెలు కథాసంపుటి – గోగినేని మణి – పుట 107**

"పబ్లిసిటీ కథ"లో కవితపాత్రతో శేఖర్‌పాత్ర రాకను వర్ణిస్తూ కవితాత్మకంగా వ్యక్తీకరించారు రచయిత్రి.

***"ఆ అడుగుల సడి నాకెరుకే***
***ఆ అడుగుల వడి నాకొరకే!"*** అని అన్నారు.

"ప్రేమలేఖ కథ"లో రమ్యకు నిశ్చయమైన వరుడు రాసిన ప్రేమలేఖలోని వర్ణనలో రచయిత్రిలోని కవయిత్రి కన్పిస్తుంది.

***"పేరు మాత్రమే కాదు రూపం కూడా రమ్యాతిరమ్యం***
***ఆ అధరాల సంగతి తెలియదు కాని మాటలు మాత్రం మధురాతిమధురం***
***ఇక ఆ మానసం నవ్యభావాల రసరమ్య కావ్యం!"*** [121]

"ఖజానా" కథలో ముగింపు సన్నివేశంలో కవితాత్మకంగా తన భావాలను ప్రధానపాత్ర ద్వారా పలికించారు రచయిత్రి.

***"నవ్వు... నరుడికి నారాయణుడిచ్చిన నజరానా!***
***నవ్వులు పండే ఇల్లు నిండు ఖజానా!"*** [122]

"స్నేహం" కథలో ఒక సన్నివేశంలో స్నేహితుల మధ్య ఉండే అలుకను వ్యక్తీకరిస్తూ రచయిత్రి ఇలా అన్నారు.

***"స్నేహితుల మధ్య అలుక జలాక్షరం....***
***చెలిమి శిలాక్షరం"*** [123]

"గెలుపునాది" కథలో మాధవ్ ప్రేయసి గీతను వర్ణించు విధానాన్ని రచయిత్రి ఇలా పలికించారు.

***"సురగంగ కెరటాల నురుగులు***
***నవ్వితే నవరత్నాలు రాలు***
***మనసైన అమ్మాయి చిరునవ్వులే సిరులు"*** [124]

---

**121. ప్రేమలేఖ కథ – తొలిచూపు కథాసంపుటి – గోగినేని మణి – పుట 17**

**122. ఖజానా కథ – మొగలిపువ్వు కథాసంపుటి – గోగినేని మణి – పుట 85**

**123. స్నేహం కథ – పిచ్చుకగూడు కథాసంపుటి – గోగినేని మణి – పుట 96**

**124. గెలుపు నాది కథ – మనసున మల్లెలు కథాసంపుటి – గోగినేని మణి – పుట 70,71**

*"రూపానికి మల్లెపువ్వు... మనసు మంచి గంధం!*
*వంట తీపి చెఱకు... పాట తేనె చినుకు!"* [125]

"మంచి గంధం" కథలోని గిరి అమ్మమ్మ రూపాన్ని తలుచుకుంటూ అతని స్నేహితుడు పవన్‌కుమార్ పాత్రద్వారా పైవ్యక్తీకరణ చేశారు రచయిత్రి.

"కలిసిన హృదయాలలోన" కథలో పెళ్ళంటే ఏమిటో కవితాత్మకంగా తెలియజేసారు.

***"పెళ్ళంటే... కాకూడదు పెద్దల మధ్య ఇచ్చి పుచ్చుకునే విషయంలో కుదిరే ఒడంబడిక!***
***అది రెండు జీవితాలు ఒక్కటయ్యే అపూరూపమైన వేడుక!!"*** [126]

"మాటలే లేని జీవతం పూలు లేని తోటలా వెలవెల పోతుంది! మనసారా చెప్పుకునే మాటలే మల్లెపూల తోటలై సంసార జీవితానికి నిత్యవసంత శోభని కలుగజేస్తాయి. సరదాల సరిగమలు పలకని సంసార గీతం ఏమంత శ్రావ్యంగా ఉండదు." [127]

భార్యభర్తల మధ్య ప్రేమ, అనురాగం ఎలా ఉండాలో పైవ్యక్తీకరణలో తెలియజేశారు రచయిత్రి.

"మంచిగంధం" కథలోని గిరిజ పాత్ర చేత తన అమ్మమ్మ మీద చక్కటి కవితను అల్లారు రచయిత్రి.

***"అమ్మమ్మ వంటిదీ, అంత మంచిది అమ్మమ్మ ఒక్కటే...***
***అమ్మయినా, నాన్నయినా అమ్మమ్మ పిమ్మటే..."*** [128]

ఈ రచయిత్రి, కవయిత్రి కూడానేమోననిపిస్తుంది. ఆమె కథలలోని ఇటువంటి వ్యక్తీకరణలు చదువుతుంటే గోగినేని మణి కథలు, నవలతో పాటు ఒక కవితా సంపుటిని కూడా వెలువరించి ఉంటే బాగుండేది. ఆమె రచనలలో చాలాచోట్ల కవితలు చోటు చేసుకున్నాయి. భావుకురాలైన రచయిత్రి కావటం వలన ఆమె కలం నుంచి అసంకల్పితంగానే కవితలు పుట్టుకొచ్చాయనిపిస్తుంది. ఇటువంటి కవితాత్మకమైన వ్యక్తీకరణలవల్ల రచయిత్రి

---

**125. మంచి గంధం కథ – మనసున మల్లెలు కథాసంపుటి – గోగినేని మణి – పుట 83**

**126. కలిసిన హృదయాలలోన కథ – మనసున మల్లెలు కథాసంపుటి – గోగినేని మణి – పుట 101**

**127. మంచి గంధం కథ – మనసున మల్లెలు కథాసంపుటి – గోగినేని మణి – పుట 37,38**

**128. మంచి గంధం కథ – మనసున మల్లెలు కథాసంపుటి – గోగినేని మణి – పుట 80**

కథలను చదవాలనే ఆసక్తి సహృదయ పాఠకుడికి మరింత కలుగుతుంది. కవితాత్మకశైలి ద్వారా పాఠకుడిని తన కథలవైపు ఆకర్షించుకునేటట్లు చేశారు గోగినేనిమణి.

కవితలను స్వతంత్రంగా రాయడం వేరు. కథలలో పాత్రల మనోభావాలకు సన్నివేశాలకు తగినట్లు పలికించడం కష్టసాధ్యమైనపని. అలా రాయగలగడం ప్రతిభావంతుడైన రచయితకే సాధ్యపడుతుంది. కథలలో అటువంటి సన్నివేశాలను కల్పించి, తనదైన శైలిలో కవితాత్మక వ్యక్తీకరణలు చేయటంలో రచయిత్రి గోగినేనిమణి సిద్ధహస్తురాలిగా కనిపిస్తారు. ఈ కథలను చదివిన ప్రతి పాఠకుడు ఈమె కలంనుండి కవితలు వెలువడి ఉంటే బాగుండేది అని కోరుకోక మానడు.

## 5.10 తిట్లు, శాపనార్థాలు :

రచనా శైలిలో చివరిగా చెప్పుకొనేది రచయిత్రి తన కథలలో ప్రయోగించిన తిట్లు, శాపనార్థాలు. ఇవి కథలో అవసరమైన చోట్ల ప్రయోగించక తప్పదు. పాత్ర యొక్క స్వభావాన్ని, సన్నివేశంలో అవసరాన్ని బట్టి వీటిని అక్కడక్కడ తమ రచనలలో రచయితలు ప్రయోగిస్తారు.

తిట్లు సామాజిక అంతస్తును సూచించే ఒక అంశం. ఒక వ్యక్తిని మానసికంగా బాధపడేటట్లు మాటలతో కఠినంగా నిందించడం లేదా ఆక్షేపించడం తిట్టు అనబడుతుంది. తెలుగులో తిట్టుకు దూరు, నిందించు, శపించు అనే అర్థాలు ఉన్నాయి.

"మనకు ఆప్తులైన వారు పెడదారిని పట్టినప్పుడూ, లేక ఎందులోనైనా కల్తీ, వెలితి కనిపించినపుడు, సహజంగా మనకు కోపం వస్తుంది. అందువల్ల వాగ్రూపమైన కోపాన్ని తిట్టు అని చెప్పవచ్చు" అని అంటారు డా॥ తూమాటి దోణప్పగారు. ఈ విధంగా తిట్లకు భాషాపరంగా కూడా మరింత ప్రాచుర్యం కలిగింది. గోగినేని మణిగారు తన రచనలలో పాత్రల యొక్క వాగ్రూపమైన కోపాన్ని చెప్పాలనుకున్నప్పుడు వీటిని ప్రయోగించినట్లు తెలుస్తుంది. అక్కడక్కడా పిల్లల ఆకతాయితనాన్ని సరదాగా తమ తల్లిదండ్రులు, అమ్మమ్మ, తాతయ్యలు మందలించినపుడు కూడా తిట్లను ప్రయోగించారు.

### తిట్లు, శాపనార్థాలు :

"వెధవ" [129]

"దుమ్మెత్తి పోయడం"[130]

"బదుర్థాయి" [131]

"ఆముదం తాగిన మొహం"[132]

"నీబొంద"[133]

"మొద్దు"[134]

"చవటాయ్"[135]

### ముగింపు :

ఈ విధంగా గోగినేని మణిగారు రాసిన రచనలలో ఉన్న భాషా, శైలీ, విశేషాలను పరిశీలిస్తే వారి రచనల్లో ఉన్న సంభాషణాశైలి, వర్ణనాత్మక శైలి, నూతన పదబంధాలు, సామెతలు, కవితాత్మక వ్యక్తీకరణ, సన్నివేశ కల్పన, ఇతివృత్త స్వీకారం మొదలైన అంశాల్లో వీరు చూపించే వైవిధ్యం చెప్పుకోదగ్గది. ఇన్ని అంశాలను స్పృశించి అనేక కథలు రాసి ఆధునిక తెలుగు కథా రచయిత్రులలో ఒక ప్రత్యేకతను, ప్రాధాన్యతను సంపాదించుకున్నారని తెలుస్తుంది. వీరు ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసము, భాషా పాండిత్యము, అనుభవం, రచనాసక్తులతోను రచనలు చేసి తెలుగు కథా సాహిత్య చరిత్రలో తమకంటూ ఒక స్థానాన్ని సంపాదించుకున్నారు.

---

129. నైన్...ఒన్...ఒన్ కథ – మనసున మల్లెలు కథాసంపుటి – గోగినేని మణి – పుట 9

130. నేను మంచిదానిని కాదు కథ – తొలిచూపు కథాసంపుటి – గోగినేని మణి – పుట 78

131. పేరు మారింది కథ – మనసున మల్లెలు కథాసంపుటి – గోగినేని మణి – పుట 56

132. మిత్రమా... మన్నించు కథ – మనసున మల్లెలు కథాసంపుటి – గోగినేని మణి – పుట 114

133. మోహనగీతం కథ– మొగలిపువ్వు కథాసంపుటి – గోగినేని మణి – పుట 77

134. ప్రేమలేఖ కథ – తొలిచూపు కథాసంపుటి – గోగినేని మణి – పుట 20

135. మంచిగంధం కథ – మనసున మల్లెలు కథాసంపుటి – గోగినేని మణి – పుట 80

# ఉపసంహారం

# ఉపసంహారం

ఆధునిక తెలుగు కథా రచయిత్రులలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న రచయిత్రి గోగినేని మణి. ఈమె తన రచనల ద్వారా వర్తమాన రచయిత్రులకు మార్గదర్శకులుగా నిలిచారు. గోగినేని మణి గారి రచనలపై పరిశోధన చేయడానికి ఆమె కథలే నాకు స్ఫూర్తిని ఇచ్చాయి. భిన్న కోణాలలో కథలు రాసి తన శైలి ద్వారా పాఠకుణ్ణి ఆకట్టుకోవడమే కాకుండా విషయాన్ని వ్యక్తీకరించడంలోనూ, కథను నడపడంలోనూ, మధ్యమధ్యన చక్కని మలుపులు తిప్పడంలోనూ వీరు చూపిన పద్ధతి ఈ పరిశోధనకు మూలకారణం అని చెప్పవచ్చు. గోగినేని మణి రచనలు సామాజిక స్పృహకు, లోకనీతికి, లోకరీతికి నిలువెత్తు నిదర్శనాలుగా చెప్పవచ్చు.

రచయిత్రి తన జీవన గమనంలో ఎదురైన అనేక సంఘటనలను వస్తువుగా స్వీకరించి రచనలు చేశారు. వీరి కథలలో సామాజిక స్పృహ, సామాజిక చైతన్యం, సామాజిక నీతి, యువత భవితవ్యం, వరకట్న సమస్య, స్త్రీల పట్ల చిన్నచూపు, ఆర్థిక కారణాలవలన విచ్ఛిన్నమైన సంబంధాలు, ఆచార సంప్రదాయాల వలన జరిగే అనర్థాలు, కుటుంబ జీవితంలో ఎదురైన చేదు సంఘటనలు, పేదరికం వలన శిధిలమైన జీవితాలు వీరి కథల్లో ప్రధానాంశాలుగా కనిపిస్తాయి.

వాస్తవిక జీవన చిత్రణకు ఈ కథలు నిలువుటద్దాలు వంటివి. ఏ కథ తీసుకున్నా ఒక అక్షర శిల్పంలా ఉంటుంది. ప్రతీ కథ రచయిత్రి పరకాయ ప్రవేశం చేసి రాసినవే. ఏ కథ గురించి వివరణ ఇవ్వాలన్నా, విశ్లేషణ చేయాలన్నా ఒక పుస్తకమే అవుతుంది. మనిషి జీవితంలోని ప్రతీ కోణాన్ని ప్రతిఫలింపజేసేవిగా ఈమె రచనలు ఉన్నాయి. ఇవి చదవదగ్గవి మాత్రమే కాదు. కలకాలం మనోఫలకంతో ఉంచదగ్గవి.

గోగినేని మణి రచనలు సున్నితమైన హాస్యంతో కూడుకుని చమత్కారమైన కథనంతో సాగుతుంటాయి. అందువల్ల పాఠకునికి విసుగు పుట్టక కడుపుబ్బా నవ్విస్తుంది. కొత్త కొత్త నుడికారాలు, పద ప్రయోగాలు పాఠకునికి కొత్త పదాలను పరిచయం చేస్తాయి. సమకాలీన సమాజంలో కనిపించే అవకాశవాద ధోరణులు, చెడు అలవాట్లు, ప్రజల మూఢనమ్మకాలు, పురుషాహంకార ధోరణి వంటి విషయాలలో మార్పును తీసుకురావడానికి తన రచనల ద్వారా ప్రయత్నించారు రచయిత్రి.

# అనుబంధం

# అనుబంధం

## గోగినేని మణి గారితో ముఖాముఖి :

*1) మీ పూర్వీకులలో రచయితలు ఎవరైనా ఉన్నారా? ఉంటే వారి గురించి చెప్పండి.*

మా పూర్వీకులలో రచయితలు ఎవరూ లేరు. మా కుటుంబంలో మా పెద్దన్నయ్య మార్ని రాంజీ తన 18వ ఏట ఆంగ్లంలో ఒక రచన రాశాడు. తరువాత రీడర్‌గా పలు యూనివర్సిటీలలో ఉద్యోగం చేస్తున్నపుడు రాసిన కొన్ని రచనలను నేపాల్ ప్రభుత్వం పాఠ్యాంశాలుగాను విద్యాలయాల్లో నిర్ణయించడం జరిగింది.

*2) మీరు రచయితగా మారడానికి ఏదైనా నేపథ్యం ఉందా?*

పుస్తకాలు చదివే అలవాటు కథలు రాయాలనే ఉత్సాహాన్ని కలుగజేసింది. చిన్నపుడు మా ఇంట్లో చాలా పుస్తకాలు అందుబాటులో ఉండేవి. ఇంటి పక్కనే గ్రంథాలయం కూడా ఉండేది. అందువల్ల పుస్తకాలు ఎక్కువగా చదువుతూ ఉండటం అలవాటు అయింది. ఆ అలవాటే కథలు రాయటానికి కారణం అయిందనుకుంటాను.

*3) మీ మొదటి రచన కథానికా, నవలా ఏది? అది రాయడానికి ప్రేరణ ఏమిటి?*

నా మొదటి రచన కథ. నేను చదువుకునే రోజుల్లో 8వ తరగతిలో స్కూలు మాగజైన్‌లో కథ ప్రచురింపబడింది. వీరేశలింగంగారి కొన్ని కథలు చదివాక, ఆ స్ఫూర్తితో జానపద కథ రాశాను. మా టీచరు చాలా ప్రోత్సాహకరంగా మాట్లాడడంతో ఇంకా రాయాలనే ఉత్సాహం కలిగింది. ఆ తరువాత ఆంధ్రప్రభ దినపత్రికలో ఆదివారం నాడు ప్రచురితమయ్యే బాలప్రభలో కొన్ని వ్యాసాలు, గేయాలూ ప్రచురింపబడ్డాయి. స్నేహం కథకు బహుమతి కూడా వచ్చింది.

పెళ్ళి, పిల్లలు... ఇలా కుటుంబ బాధ్యతలతో రాయడం వెనకబడింది. చాలా సంవత్సరాల తర్వాత ఆంధ్రపత్రిక (వారపత్రిక)లో 'తొలిచూపు' కథ ప్రచురింపబడింది. పెద్దయ్యాక అదే నా మొదటి కథ.

సినిమా హాలులో ఎదురైన ఒక చిన్న సంఘటననే ఆ కథగా రూపుదిద్దుకుంది.

*4) రచనా వ్యాసంగ విషయంలో కుటుంబ సంబంధమైన అడ్డంకులేమైనా ఎదురయ్యాయా?*

తీరిక సమయాలలో తోచిన విషయాన్ని కథగా మలిచే ప్రయత్నం చేసేదాన్ని ఈ విషయంలో కుటుంబపరంగా అడ్డంకులేమీ లేవు.

***5) మీ కథలలో ఎక్కువగా ఉత్తరాంధ్ర యాస ఉంటుంది ఎందుకు?***

నేను ఉంటున్న ప్రాంతపు వాడుక భాషలోనే రాస్తున్నాను. యాస అనేది నేను గమనించలేదు.

***6) 'సుజన' నవల రాయడానికి ప్రేరణ ఏమిటి? అందులో సృష్టించిన పాత్రలు మీకెక్కడయినా తారసపడ్డాయా? కొంచెం వివరిస్తారా?***

ఆ నవల రాయడానికి ప్రత్యేకంగా ప్రేరణ అంటూ ఏమి లేదు గానీ చిన్నపుడు స్వామీజీలు, మహిమలు అంటూ కొందరు మోసపోవడం గురించి విన్నాను. ఆ విషయం ఆధారంగా చేసుకుని కల్పించినది సుజన నవల.

శకునం పట్ల ఉన్న కొందరి నమ్మకాలనూ గమనించాను. శకునాల కారణంగా కొందరు నిందల్ని భరించటమూ, బాధపడటమూ చూశాను. ఆ విషయాలూ ఈ నవల రాయటానికి దోహదపడిన అంశాలే.

***7) మీ రచనలలో ఎక్కువగా కుటుంబ జీవన విధానం గురించి ఉంటుంది. ఎందుకు?***

నేను గృహిణిని కాబట్టి నా కథలూ ఎక్కువ కుటుంబపరమైనవి గానే రూపుదిద్దుకుని ఉండొచ్చు. తెలిసిన విషయాల గురించే రాయాలనుకోవడం వలన కుటుంబపరమైన కథలకే ప్రాముఖ్యత ఏర్పడిందనుకుంటాను.

***8) మీరు రాసిన కథలలో ఎక్కువగా సందేశాత్మక పాత్రలు ఉంటాయి. ఎందుకు?***

కథలోని ప్రధానపాత్ర తన నడవడి ద్వారానో, మాటలతోనో పాఠకులకూ మంచి దారిని చూపించగలగాలని అనుకుంటున్నాను. మామూలు మాటలకంటే కథ ద్వారా మంచి విషయాన్ని పాఠకుల మనసుకు హత్తుకోగలిగేట్లుగా చెప్పగలగాలి. అటువంటి ప్రయత్నమే నేనూ చేస్తుంటాను.

***9) మీకు ఆదర్శ రచయితలు ఎవరు? ఎందుకు?***

నాకు నచ్చిన ప్రతీ పుస్తక రచయితే నాకు ఆదర్శమే. అలా రావిశాస్త్రి గారి దగ్గర్నుండి యండమూరి వరకూ ఎందరో రచయితలకు నేను అభిమానినే. రావిశాస్త్రిగారు చెప్పే ఏ విషయాన్నైనా ప్రత్యేకమైన శైలిలో చెబుతారు. యండమూరిగారు కథను నడిపించే తీరు ఆసక్తికరంగా ఉంటుంది.

***10) రచనలు చేయడంలో కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉందా?***

ఉంది. నేను రాసిన ఏ కథ ప్రచురింపబడినా మావారు, ఇద్దరు పిల్లలు చాలా ఆనందాన్ని చూపిస్తారు. అలా కథలు రాయాలనే ఉత్సాహానికి వారే కారకులు.

***11) మీ రచనలకు మొదటి పాఠకులు ఎవరు?***

మా వారు, అమ్మాయి మొదటగా చదువుతూంటారు. ఒక్కోసారి వారికి తోచిన సూచనలూ, సలహాలూ ఇస్తుంటారు.

***12) మీ రచనలు ఏమైనా పత్రికలలో ప్రచురింపబడ్డాయా? వివరించండి.***

ఇప్పటి వరకూ 79 కథలు వివిధ వార, మాస పత్రికలలోనూ, దినపత్రికలలో ఆదివారం అనుబంధాలలోనూ ప్రచురింపబడ్డాయి. ఆ కథలు ఇప్పటికి నాలుగు సంపుటాలుగా ప్రచురింపబడ్డాయి.

అవి మొదటి కథాసంకలనం – 'తొలిచూపు'
రెండవది 'మనసున మల్లెలు'
మూడోవది 'మొగలిపువ్వు'
నాలుగవది 'పిచ్చుక గూడు'

ఒక నవల 'సుజన' కలవారి కోడలు పేరుతో ప్రముఖ వారపత్రికలో సీరియల్‌గా వచ్చింది.

***13) మీ రచనలకు బహుమతులు ఏమైనా వచ్చాయా?***

'నిప్పు లేని పొగ' అనే కథ ఆంధ్రపత్రిక (వారపత్రిక)లో బహుమతి పొందిన మొదటి కథ. 'నైన్-ఒన్-ఒన్' అనే కథ కామెడీ కథల పోటీలో (స్వాతి వారపత్రిక) ప్రథమ బహుమతి పొందింది.

'ఎదురుచూపు' అనే కథ ఆదివారం ఆంధ్రజ్యోతిలో నిర్వహింపబడిన కథల పోటీలో బహుమతి పొందింది.

'పిచ్చుక గూడు' కథ బలివాడ కాంతారావు స్మారక కథల పోటీలో ఆంధ్రజ్యోతి వారి నవ్య వీక్లీ ద్వారా బహుమతి పొందింది.

'మొగలిపువ్వు' కథ కీ॥శే॥ గిడుగు రాజేశ్వరరావు గారి ప్రశంసనూ, నగదు బహుమతినీ అందుకొంది.

***14) నవలల కంటే కథలు ఎక్కువగా రాస్తున్నారు. వివరించగలరా?***

పది పేజీలలో నాకుతోచిన వస్తువును కథగా చెప్పడమే నాకు సౌకర్యంగా ఉంటుంది. నవలకు పరిధి ఎక్కువగా ఉంటుంది. అందువలనే నవలలు ఎక్కువగా రాయలేకపోయానని అనుకుంటున్నాను.

***15) మీరు రాసిన కథలలో బాగా నచ్చినవి ఏవి? ఎందుకు?***

చాలా కథలే ఉన్నాయి. మా అమ్మానాన్నగారల జీవితంలోని ఒకటి రెండు అనుభవాలను ఆధారంగా చేసుకుని రాసిన కథ 'రాట్నం పిలిచింది' నాకు నచ్చినది. 'ఎదురుచూపు' కథ కూడా నాకు బాగా నచ్చిన కథ. ఎవరి ఆనందానికైనా చక్కని కుటుంబ వాతావరణమే కారణం అవుతుందని నేను అనుకుంటాను. ఆ విషయాన్ని ప్రస్తావిస్తూ రాసిన కథ అవడంవలన కూడా నాకు నచ్చిన కథ అని చెప్పగలను. అరుగుల బడి, పిచ్చుకగూడు కథలకు ప్రేరణ ఏమీ లేదు. కల్పితాలే. పాఠకుల ప్రశంసలను పొందడం వలన అవి కూడా ఆ జాబితాలోనే చేరాయి.

హాస్య కథలలో 'మొగలిపువ్వు', 'ప్రేమలేఖ' కథలూ నాకు ఇష్టమైనవే. కథను సరదాగా చెప్పగలిగే ప్రక్రియ నాకు నచ్చుతుంది. ఈ కథలు అలాగే సాగుతాయి. అందువలనే నచ్చిన కథలుగా చెప్పగలనుకుంటున్నా.

***16) మీ ప్రభావం తరువాత రచయితల మీద ఏమైనా ఉందా? ఉంటే వారెవరు?***

అలా ఇతర రచయితలపై ఉందని నేననుకోవడం లేదు.


***17) నేటి రచయితలూ, రచనల పట్ల మీ అభిప్రాయం చెప్పగలరా?***

కీర్తిప్రతిష్టలు, ధనతృష్టపై రచయిత మనసు లగ్నమైతే రాసేదాని మీద దృష్టి సన్నగిల్లుతుంది. ఈ పరిధులను దాటి రాసేవాళ్ళెందరో నేటి రచయితలలో ఉన్నారు. వారే సాహితీ ప్రక్రియ దారాన్ని తెగకుండా ముందుకు నడిపిస్తున్నారు.

***18) భావితర రచయితలకు మీ సూచనలు చెప్పగలరా?***

సామాన్యస్థాయి పాఠకులకు కూడా నచ్చే రచనలు చేయగలగాలి. ముందుతరం రచయితలను సంప్రదించి తెలుసుకోవాలి. సంఘటనలను చక్కగా వ్యక్తీకరించాలి. వర్ణన ముఖ్యం కాదు. ఇతివృత్తం ప్రధానంగా ఉండాలి.


## గోగినేనిమణి గారి కథాసంపుటాలు














గోగినేనిమణి గారి నవల




కన్నడంలో అనువదించబడిన
గోగినేనిమణి గారి రచన

## గోగినేనిమణి గారితో నేను



## కుటుంబ సభ్యులతో గోగినేనిమణి



# ఉపయుక్త గ్రంథసూచి

# ఉపయుక్త గ్రంథసూచి

1. అడివి బాపిరాజు కథలు–కవిత్వం–పరిశీలన – డా॥ వి. సిమ్మన్న
సిద్ధాంత గ్రంథం – ఆంధ్రవిశ్వకళాపరిషత్
వాల్తేరు–1985

2. ఆధునీకాంధ్ర కవిత్వము–సంప్రదాయములు–ప్రయోగములు – డా॥ సి.నారాయణరెడ్డి
ముద్రణ : శివాజీప్రెస్, గుంజా బజార్
సికింద్రాబాద్–1967

3. ఆధునిక తెలుగు కథానిక – దాని అందచందాలు – విహారి
భారతీయ పత్రిక, జనవరి–1971

4. ఆంధ్ర నవలా పరిణామం – బొడ్డపాటి కుటుంబరాయశర్మ
ఉస్మానియా విశ్వవిద్యాలయం
గాంధీప్రచురణ, హైదరాబాద్–1962

5. ఆంధ్రుల జానపద విజ్ఞానం – డా॥ ఆర్వీయస్. సుందరం
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
పబ్లిక్ గార్డెన్స్, నాంపల్లి, హైదరాబాద్–500 004

6. కథాశిల్పం – వల్లంపాటి వెంకటసుబ్బయ్య
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
విజ్ఞాన భవన్, 4–1–435,
హైదరాబాద్

7. కథానిక – ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి
ప్రతిభ పత్రిక – 1936

8. కథానిక - దాని పరిణామము - తల్లావజ్ఝల శివశంకర శాస్త్రి
భారతి పత్రిక సెప్టెంబర్-39,
సారస్వత వ్యాసం-నాల్గవ సంపుటం
ఆంధ్రప్రసాద్ సాహిత్య అకాడమీ

9. కథానిక వాఙ్మయం - డా॥ పోరంకి దక్షిణామూర్తి
ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ
హైదరాబాద్

10. కథానికా శిల్పం - పాలగుమ్మి పద్మరాజు
భారతీ పత్రిక
నవంబర్-1946

11. కవిత్వతత్త్వ విచారం, - డా॥ కట్టమంచి రామలింగారెడ్డి
ఆంధ్రాయూనివర్శిటీ,
ప్రచురణ, వాల్తేరు-1980.

12. చలం-కథానికా సాహిత్యం - డా॥ వావిలాల సుబ్బారావు
ఆంధ్ర విశ్వకళాపరిషత్
వాల్తేరు-1982

13. తెలుగు కథా వాస్తవికత - సాహితీ వ్యాసంగం - డా॥ అక్కిరాజు రమాపతిరావు
(వ్యాస సంకలనం)
నవోదయ బుక్ హౌస్, హైదరాబాద్-1994

14. తెలుగు కథానిక-స్వరూప స్వభావాలు - డా॥ పోరంకి దక్షిణామూర్తి
ఉస్మానియా విశ్వవిద్యాలయం
హైదరాబాద్-1977

15. తెలుగు నవలానుశీలనం - డా॥ ఎమ్.సుజాతారెడ్డి

16. తెలుగు నవలల్లో కుటుంబ జీవనం - డా॥ సి.ఆనందరామం
నవజ్యోతి పబ్లికేషన్
విజయవాడ - 1979, నవంబర్

17. తెలుగు నవలా వికాసం - మొదలి నాగభూషణశర్మ
నాట్య కళాపరిషత్
హైదరాబాద్-1971

18. తెలుగు నవలా సాహిత్య వికాసం - పుల్లాబొట్ల వెంకటేశ్వర్లు
వై.ఎన్.ప్రెస్, ఖమ్మం-1984

19. తెలుగు సామెతలు - జనజీవనం - పాపిరెడ్డి నరసింహారెడ్డి
శ్రీనివాస మురళీ పబ్లికేషన్స్, తిరుపతి - 1983

20. తెలుగు సాహిత్య సమీక్ష, రెండవ సంపుటి, - ఆచార్య జి. నాగయ్య
నవ్య పరిశోధక ప్రచురణ
18.01.700, భవానీనగర్, తిరుపతి

21. తొలిచూపు కథాసంపుటి - గోగినేనిమణి
సత్యం ఆఫ్‌సెట్ ప్రింటర్స్, దొండపర్తి
విశాఖపట్నం

22. నవలా శిల్పం -వల్లంపాటి వెంకటసుబ్బయ్య
విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్
విజ్ఞానభవన్, 4-1-435
బ్యాంకు వీధి, హైదరాబాద్-500 001-ప్రథమ ముద్రణ-1989

23. పిచ్చుకగూడు కథాసంపుటి – గోగినేనిమణి
రామకృష్ణా ప్రింటర్స్, మధురానగర్
విశాఖపట్నం

24. బలివాడ కాంతారావు నవలలు – డా॥ గజ్జా యోహాన్‌బాబు
ఆంధ్రవిశ్వకళాపరిషత్
వాల్తేరు

25. మన తెలుగు కథారచయితలు – మల్లాది రామకృష్ణశాస్త్రి
రచన (ఆరుద్ర)

26. మన తెలుగు నవలలు – కడియాల రామమోహనరాయ్
(నూరు నవలల విశ్లేషణ)
(1892 నుండి 2010 వరకు)
"అజో–విభ్–కంధాళం ఫౌండేషన్"

27. మనసున మల్లెలు – గోగినేని మణి
సత్యం ఆఫ్‌సెట్ ప్రింటర్స్, దొండపర్తి
విశాఖపట్నం

28. మొగలి పువ్వు – గోగినేని మణి
రామకృష్ణ ప్రింటర్స్
మధురానగర్, విశాఖపట్నం

29. సాహిత్య వ్యాసాలు – కొలకలూరి ఇనక్
సి.ఎల్.ఎస్. బుక్‌షాపు, స్టేషన్ రోడ్డు
హైదరాబాద్ – 1974

30. సాహిత్య ప్రయోజనం – వ్యాసావళి –డా॥ కొడవటిగంటి కుటుంబరావు

31. సుజన నవల – గోగినేని మణి
రామకృష్ణ ప్రింటర్స్
మధురానగర్, విశాఖపట్నం

**అన్యభాషా గ్రంథాలు :**

32. The Novel and the people – Ralph Fox

33. కహానికా రచనా విధాన్ – డా॥ జగన్నాధశర్మ